సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



58 ఫిర్యాదులు
కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 58 ఫిర్యాదులు నమోదయ్యాయి. కలెక్టర్ ఫిర్యాదులు స్వీకరించారు.
- 8లో ▸



ఖజానాకు తాళం?
ట్రెజరీలలో ఫ్రీజింగ్ కొనసాగుతుండడంతో చాలా పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు కావడం లేదు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.7 /18.8
వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



కొనుగోళ్లకు సన్నద్ధం

వరి పంట చేతికి వస్తుండడంతో ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ యాసంగి సీజన్‌లో 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్న లక్ష్యంతో సాగుతున్నారు. ఇందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

- జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రావచ్చని అంచనా
- పక్షం రోజుల్లో సేకరణ ప్రారంభించే అవకాశం


బీర్కూర్‌లో హార్వెస్టర్‌తో వరి కోస్తున్న దృశ్యం

సాక్షి, కామారెడ్డి: జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వరి పంట కోతకు వచ్చింది. కొన్నిచోట్ల ఇప్పటికే కోతలు కూడా ప్రారంభయ్యాయి. మరో పక్షం రోజుల్లో కోతలు జోరందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లకు కసరత్తు చేస్తోంది. యాసంగి సీజన్‌లో జిల్లాలో 2.60 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 6.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వ్యాపారులకు విక్రయిస్తారని, రైతులు తమ అవసరాలకు ఉంచుకుంటారని అంచనా వేస్తున్న అధికారులు.. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలో నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ తదితర మండలాల్లో వరి కోతలు పూర్తవుతాయని, 2.78 లక్షల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మే మాసంలో మరో 3.04 లక్షల మెట్రిక్ టన్నులు, ఆలస్యంగా నాట్లు వేసిన దానికి సంబంధించి జూన్‌లో మరో 18 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. దీనికి అనుగుణంగా జిల్లాలో 350 కొనుగోలు కేంద్రాలను తెరవాలని నిర్ణయించారు. ఇందులో సహకార సంఘాల ఆధ్వర్యంలో 320 కేంద్రాలు, ఐకేపీ ద్వారా 21 కేంద్రాలు, మార్కెట్ కమిటీల ద్వారా తొమ్మిది కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

మరికొన్ని రోజులు ఆగాల్సిందే....

ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవడానికి ఇంకో పది పదిహేను రోజుల సమయం పట్టవచ్చని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. జిల్లాకు అవసరమైన మేర గన్నీ బ్యాగులు సమకూర్చుకోవడం, ట్రాన్స్‌పోర్టు ఆపరేటర్లను ఖరారు చేయడం, హమాలీలను సమీకరించడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. అవన్నీ పూర్తై కొనుగోళ్లు మొదలు పెట్టాలంటే మరో పక్షం రోజులు పట్టే అవకాశం ఉంది. అయితే ముందుగా కోతలు మొదలుపెట్టిన రైతులు కేంద్రాలను సకాలంలో తెరవకపోతే ఇబ్బందులు పడతామని ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఓ వైపు ఎండలు.. మరోవైపు వడగళ్ల భయం

రకరకాల తెగుళ్లతో వరి దెబ్బతిని ఇబ్బందుల్లో ఉన్న రైతులు.. పంట కోతకు వస్తున్న సమయంలో ఎండలు మండుతుండడం, మరోవైపు మేఘాలు కమ్ముకొస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కొన్ని ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షాలు, వడగళ్లతో కొంతమేర పంట దెబ్బతింది. మళ్లీ వడగళ్లు, ఈదురుగాలులతో కూడిన వానలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులు భయపడుతున్నారు. ఓవైపు ఎండలతో పంట దెబ్బతింటుండగా, మరోవైపు వడగళ్లు కురిస్తే మరింత నష్టం తప్పదని ఆందోళన చెందుతున్నారు.

నియోజకవర్గాలవారీగా కొనుగోలు కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	ఏఎంసీ	ఐకేపీ	పీఏసీఎస్	మొత్తం
బాన్సువాడ	02	01	41	44
కామారెడ్డి	04	05	73	82
జుక్కల్	02	05	71	78
ఎల్లారెడ్డి	01	10	135	146
మొత్తం	09	21	320	350

రైతుల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

- ఆత్మీయ సమ్మేళనంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

పిట్లం: ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. సోమవారం చిల్లర్గి గ్రామంలో మండలంలోని 14 గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో రూ. 550 కోట్లతో నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు కొనసాగుతున్నాయని, ఈ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలో నాన్‌కమాండ్ ఏరియాలోని 40 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు దాదాపు ప్రతి కుటుంబానికి చేరుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. దీంతో దేశ ప్రజలు కేసీఆర్ సేవలను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే కాకముందు జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉండేదన్నారు. 100 గ్రామాలకు రోడ్లు లేవన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత జుక్కల్ నియోజకవర్గంలోని 80 గ్రామాలకు రోడ్లు వేయించానన్నారు. ముఖ్యమంత్ర కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో మిగతా గ్రామాలకూ రోడ్లు వేయిస్తామన్నారు. నియోజకవర్గాన్ని 75 శాతం అభివృద్ధి చేశానని, వచ్చే ఎన్నికల్లోనూ గెలిపిస్తే 100 శాతం అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. రాంపూర్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత విజయ్, జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ సాయిరెడ్డి, సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, నాయకులు రజనీకాంత్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, అన్నారం వెంకట్‌రాంరెడ్డి, బాబుసింగ్, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, కరీం, నవీన్, నర్సాగౌడ్, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామచంద్రస్వామి రథోత్సవం


అడ్లూర్‌లో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


రామారెడ్డిలో ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కామారెడ్డి రూరల్: అడ్లూరులోని సీతారామచంద్ర స్వామి ఆలయ రథోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రథాన్ని లాగారు. రథోత్సవం అనంతరం నిర్వహించిన చక్ర తీర్థంతో ఉత్సవాలు ముగిశాయి. లింగాపూర్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవంలో భాగంగా సోమవారం 16 పండుగ నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

రామారెడ్డి: రామారెడ్డిలో శ్రీరామ నవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం సీతారాముల బ్రహ్మోత్సవాలలో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

5,150 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం కంటి వెలుగులో 5,150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 805 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 2,69,514 మందికి కంటి పరీక్షలు చేసి, 42,360 మందికి కంటి అద్దాలను అందజేశామని వైద్యాధికారులు తెలిపారు.

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్రబృందం



నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ సంతోష్ కడ్లే, డాక్టర్ రాజారాం సందర్శించారు. నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్‌క్వాస్)లో భాగంగా పీహెచ్‌సీ నిర్వహణ తీరును పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందిస్తున్న సేవలను గురించి తెలుసుకున్నారు. ఆశవర్కర్లతో మాట్లాడి గ్రామాల్లో వారు అందించే సేవలను గురించి తెలుసుకున్నారు. ఎన్‌క్వాస్ కార్యక్రమంలో భాగంగా కేంద్రబృందం పీహెచ్‌సీని సందర్శించిందని డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తెలిపారు. రెండురోజుల పాటు పీహెచ్‌సీలో అందిస్తున్న సేవలను, పరిసరాలను వారు క్షుణ్ణంగా పరిశీలిస్తారన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ఎన్‌క్వాస్ మేనేజర్ జరీనా, పీహెచ్‌సీ సిబ్బంది రామారావు తదితరులు ఉన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



కామారెడ్డి క్రైం: కలెక్టరేట్‌లో ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు సాయిలు, రాజారాం, చక్రధర్, శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను సోమవారం కలెక్టర్ పరిశీలించారు. గోదాంలో ఉన్న సీసీ టీవీల పనితీరు, రికార్డులను పరిశీలించారు. భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట జిల్లా ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, అధికారులు ఉన్నారు.

'బలగం' ప్రదర్శించిన ఎల్‌ఈడీ స్క్రీన్ స్వాధీనం



రాజంపేట: మండలంలోని ఓ గ్రామంలో ఆదివారం రాత్రి ఎల్‌ఈడీ స్క్రీన్ ద్వారా బలగం సినిమాను ప్రదర్శించారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆ గ్రామానికి బయలుదేరారు. ప్రదర్శన అనంతరం మండల కేంద్రానికి ఎల్‌ఈడీ స్క్రీన్ మెటీరియల్‌ను తీసుకుని వస్తున్న ఆటోను రాజంపేట శివారులో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సోమవారం వదిలేసినట్లు తెలిసింది.

తెయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల

తెయూ(డిచ్‌పల్లి) : తెయూ పరిధిలోని డిగ్రీ 3వ, 5వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం వీసీ రవీందర్ విడుదల చేశారు. పరీక్ష ఫలితాల కోసం తెయూ వెబ్‌సైట్ www.telanganauniversity.ac.in లో సంప్రదించాలని కంట్రోలర్ అరుణ విద్యార్థులకు సూచించారు.

'కర్ర'ంటు స్తంభం!


విద్యుత్ స్తంభంగా వినియోగిస్తున్న కర్ర

విద్యుత్ లైన్ల కోసం సిమెంట్ స్తంభాలను వినియోగించడం చూస్తుంటాం. కానీ ఆ గ్రామంలో కర్రనూ విద్యుత్ స్తంభంగా వాడుతున్నారు. గాంధారి మండలంలోని హేమ్లానాయక్ తండా సమీపంలో ప్రధాన రహదారి పక్కన ఈ కర్ర స్తంభం ఉంది. ఆ మార్గంలో వెళ్లేవారు ట్రాన్స్‌కో అధికారుల పనితీరును చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

– సాక్షి, కామారెడ్డి

'టీఎఫ్‌టీ లైసెన్స్‌లు ఇప్పించండి'


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వడ్లూర్‌వాసులు

కామారెడ్డి రూరల్: టీఎఫ్‌టీ లైసెన్స్‌లు ఇప్పించాలని మోకుదెబ్బ ప్రతినిధులు ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కోరారు. వడ్లూర్–2 కల్లు డిపో సభ్యులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. తమ కల్లు దుకాణానికి అడ్డు పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై స్థానిక ఎక్సైజ్ ఈఎస్, రూరల్ ఎక్సైజ్ సీఐలకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. రెండు లైసెన్సులపై 25 గౌడ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. లైసెన్స్‌లు ఇప్పించి, దుకాణాలను నడుపుకునేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు నర్సాగౌడ్, జిల్లా అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 99.78 శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్


జిల్లాకేంద్రంలోని జీవదాన్ స్కూల్‌లో పరీక్షల తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి టౌన్: జిల్లాలో 63 పరీక్షా కేంద్రాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. 11,899 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. 11,873 మంది హాజరయ్యారు. 26 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 99.78 గా నమోదయ్యింది. తొలి రోజు కావడంతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి కనిపించింది. విద్యార్థుల వెంట వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వచ్చారు. విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లా కేంద్రంలో పలుచోట్ల జిరాక్స్ కేంద్రాలను తెరిచే ఉంచారు. కొత్తబస్టాండ్ సమీపంలో కొన్ని జిరాక్స్ సెంటర్‌లు తెరిచి ఉన్నా అధికారులు పట్టించుకోలేదు.

పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లాలో ఎస్సెస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఆయన సోమవారం జిల్లా కేంద్రంలోని జీవదాన్, దేవునిపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. డీఈవో ఎస్.రాజు, పరీక్షల నిర్వహణ అధికారి నీలం లింగం పరీక్షలను పర్యవేక్షించారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



కామారెడ్డి క్రైం: అడ్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పరీక్ష కేంద్రంలో కల్పించిన మౌలిక వసతులను గురించి తెలుసుకున్నారు.

పరీక్ష రాసిన అంధ విద్యార్థి


స్నేహితుడి సహాయంతో పరీక్షకు హాజరైన అంధ విద్యార్థి సిద్దరాములు

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఓ అంధ విద్యార్థి మరో విద్యార్థి సహాయంతో పదో తరగతి పరీక్ష రాశాడు. వివరాలిలా ఉన్నాయి. ర్యాగట్లపల్లికి చెందిన సిద్దరాములు పుట్టుకతో అంధుడు. అతడు పదో తరగతి చదువుతున్నాడు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో సోమవారం పరీక్షకు హాజరయ్యాడు. అంధుడు కావడంతో పరీక్ష రాయడానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ర్యాగట్లపల్లికి చెందిన మనోజ్ సహాయం తీసుకున్నాడు. సిద్దరాములు జవాబులు చెప్పగా మనోజ్ పరీక్ష రాశాడు.

'జయంతి వేడుకల్లో పాల్గొనాలి'


మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్యకు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

కామారెడ్డి క్రైం: మహనీయుల జయంతి వేడుకలకు అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెలలో జరిగే బాబూ జగ్జీవన్‌రాం, బీఆర్ అంబేద్కర్, జ్యోతీబాపూలే జయంతి వేడుకలకు పార్టీలకు అతీతంగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సంక్షేమ శాఖల అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలి

కామారెడ్డి క్రైం: వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన యోధుడు దొడ్డి కొమురయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం దొడ్డి కొమురయ్య జయంతి నిర్వహించారు. దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోరాట స్ఫూర్తికి దొడ్డి కొమురయ్య ప్రతీక అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, కార్యదర్శి సాయిలు, ఉద్యోగులు సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజలింగం, బీసీ సంఘాల నాయకులు శివరాం, రాజయ్య పాల్గొన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కామారెడ్డి టౌన్: బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కన్వీనర్, బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ బీడీ కార్మికుల కోసం బీడీ కాలనీ నిర్మించి ఇవ్వాలన్నారు. ఖాళీ స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు చెల్లించాలని, అర్హులైన నిరుపేద కార్మికులకు డబల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులందరికి జీవనభృతి అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రోళ్ల సత్యం, రాజనర్సు, లావణ్య, లక్ష్మి, షబానా బేగం, సోనీ, లత, ఇందిర, నాగమణి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

క్లుప్తంగా

10 నుంచి ఉచిత శిక్షణ

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి మహిళలకు మగ్గం వర్క్, టైలరింగ్, బ్యూటీపార్లర్ కోర్సుల్లో 30 రోజుల ఉచిత శిక్షణ ప్రారంభమవుతుందని డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు శిక్షణ, భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందన్నారు. 19 నుంచి 45 ఏళ్లు ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, ఎస్సెస్సీ ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని వచ్చి సంస్థ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 08461 222428, 08461 295428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పీజీ పరీక్షల్లో 153 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఈ పరీక్షల్లో మొత్తం 153 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం జరిగిన పీజీ 3వ, 9వ సెమిస్టర్ పరీక్షల్లో 796 మంది విద్యార్థులకు గానూ 728 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన పీజీ 1వ, 5వ, 7వ సెమిస్టర్ పరీక్షలలో మొత్తం 906 మందికి గానూ 825 హాజరైనట్లు ఆమె వివరించారు. ఎల్‌ఎల్‌బీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 30 మంది విద్యార్థులకు గానూ 26మంది పరీక్ష రాశారని తెలిపారు.

వర్సిటీకి త్వరలో నూతన అంబులెన్స్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రస్తుతం ఉన్న అంబులెన్స్‌తో పాటు విద్యార్థుల వినతి మేరకు నూతనంగా మరో అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్న ఒక్క అంబులెన్స్ సర్వీసింగ్ వెళితే ఆ సమయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే నూతన అంబులెన్స్‌ను కొనుగోలు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని పేర్కొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి క్రైం: గంజాయి ప్యాకెట్లను విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పట్టణ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో గంజాయిని ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. అశోక్ నగర్ కాలనీకి చెందిన పృథ్వీ, టేక్రియాల్ గ్రామానికి చెందిన శివ అనే యువకులు మహారాష్ట్రలోని ఉమ్రి ప్రాంతం నుంచి గంజాయిని తీసుకువచ్చి ప్యాకెట్ల రూపంలో కామారెడ్డిలోని యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా 10 గంజాయి ప్యాకెట్లు దొరికాయి. కామారెడ్డి తహసీల్దార్ వెంకటరావు సమక్షంలో పంచనామా నిర్వహించి నిందితులను రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

దోమకొండ: మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్‌డ్రైవ్ కేసులో దొరికిన ఇద్దరికి జైలు శిక్ష పడినట్లు ఎస్సై సుధాకర్ సోమవారం తెలిపారు. దోమకొండకు చెందిన డి లింగం, సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన చంద్రప్రకాశ్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ దొరికారని చెప్పారు. వీరిని కోర్టులో హాజరు పర్చగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి ప్రతాప్ రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.200 చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు.

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



నిజామాబాద్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

ఖలీల్‌వాడి: అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 78 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, నిజామాబాద్ ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కమ్మర్‌పల్లి మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతులకు రైతుబంధు రాకపోవడంతో కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ ప్రతి ఏటా రైతు బంధు వచ్చిందని ఈ సంవత్సరం రైతుబంధు రాలేదని వాపోయారు. అలాగే కమ్మర్‌పల్లికి చెందిన పలువురు రోడ్డు వెడల్పులో విలువైన ఇళ్లను కోల్పోతున్నామని కలెక్టర్‌కు విన్నవించారు.

పులిహోర వితరణ

ప్రజావాణికి వచ్చిన ప్రజలకు సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పులిహోర వితరణ చేశారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా పులిహోర పంపిణీ చేశారు. ప్రతి సోమవారం దీనిని కొనసాగిస్తామని సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు భూమన్న తెలిపారు. మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో మంచినీటిని సమకూర్చారు. రాజిరెడ్డి, అరుణ్ బాబు, విజయ్ కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామారెడ్డిలో 58 ఫిర్యాదులు



ప్రజావాణి ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ , అధికారులు

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 58 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 45 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు చెందినవే కావడం గమనార్హం. మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు. కలెక్టర్ పాటిల్, అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అధికారులు వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

పాఠశాల స్థలంలో ప్రకృతివనం ఏర్పాటు చేయాలని వినతి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణం భవానీరోడ్డులోని పాఠశాల భవనం స్థలంలో ప్రకృతి వనం ఏర్పాటు చేయాలని హమారా మిట్టి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధురాలు ఎస్ లత ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. విద్యార్థులు లేక బడి మూసివేయడంతో భవనంలో అసాంఘిక కార్యకలపాలు జరుగుతున్నాయన్నారు.

ధరణిలో భూమి నమోదు చేయాలి

తన భూమి పట్టాపాస్ బుక్కులో నమోదు కాలేదని లింగంపేట మండలం లింగంపల్లి కుర్దుకు చెందిన గాలెం అంజయ్య ఫిర్యాదు చేశారు. గ్రామ శివారులో తనకు 14 గుంటల భూమి ఉందని, అది ధరణిలో నమోదు కాలేదని పేర్కొన్నారు.

ఖజానాకు తాళం!

- ఫ్రీజింగ్‌తో ఆగిపోతున్న బిల్లులు
- ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న నేతలు, కాంట్రాక్టర్లు



బాన్సువాడ ట్రెజరీ కార్యాలయం

బాన్సువాడ: ఖజానాకు ఫ్రీజింగ్ జబ్బు పట్టుకుంది. నెలలు తరబడి ఇదే పరిస్థితి నెలకొనడంతో కాంట్రాక్టర్లు, ఇతర అభివృద్ధి పనులు చేసిన వారు బిల్లుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ట్రెజరీల చుట్టు తిరుగుతున్నారు. ప్రస్తుతం ట్రెజరీలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండడంతో ఈ పరిస్థితి నెలకొంది. కార్మికుల జీతాలు, ఇతరత్రా చిన్న, చిన్న బిల్లులు మినహా మిగతా బిల్లులు పాసవ్వడం లేదు. గతంలో కొన్ని సందర్భాల్లో సర్కారు ఖజానాకు నేరుగా ఫ్రీజింగ్ అని వచ్చేది. ఇప్పుడు ఫ్రీజింగ్‌లో అధికారులు బిల్లులు చేసి పంపిన తర్వాత సుమారు మూడు నెలల అనంతరం పాసవుతున్నాయి. వెబ్‌సైట్‌లో పరిశీలిస్తే వెయింటింగ్ ఫర్ గవర్నమెంట్ అప్రూవల్ అని వస్తుందని సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ పనులకు సంబంధించిన కుప్పలు తెప్పలుగా ఎస్టీవోలో పేరుకుపోతున్నాయని కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. కొన్ని సందర్భాల్లో మాత్రం ట్రెజరీలపై ఒత్తిడి లేకుండా బిల్లులు మాత్రం చేసి ఆప్‌లోడ్ చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. తమ వద్ద పెండింగ్‌లో లేదని స్పష్టం చేస్తున్నారు. బిల్లులు చేసినా బ్యాంకుల నుంచి డబ్బులు డ్రా కావటం లేదని, దీంతో ఏం చేయాలో పాలుపోవడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్పంచులకు, ఎంపీటీసీలకు ఇచ్చేదే తక్కువ నిధులని, వాటితో అరకొర పనులు చేస్తే ఆ బిల్లులు కూడా సకాలంలో రాకపోతే ఎలా అని బాన్సువాడ మండలానికి చెందిన ఓ సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు.

మెజారిటీ బిల్లులది ఇదే పరిస్థితి

మెజారిటీ బిల్లులు ఫ్రీజింగ్ సమస్యతో పాస్ కావడం లేదు. ఒకటి రెండు మినహా అన్ని రకాల ఖాతాలది ఇదే పరిస్థితి. 15వ ఆర్థిక సంఘం నిధులు, జీపీ జనరల్, స్టేట్ ఫైనాన్స్ తదితర అన్ని రకాల నిధులకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ట్రాక్టర్ల నిర్వహణ, పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సీసీ రోడ్లు, మధ్యాహ్న భోజనం బిల్లులు, హాస్టళ్ల బిల్లులు, జీపీఎఫ్ లోన్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, తదితర అన్ని రకాల బిల్లులు నెలల తరబడి మూలుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు, కార్మికుల వేతనాలు మాత్రం కొంతమేర తొందరగా విడుదల అవుతున్నాయి. ఖాతాల ఫ్రీజింగ్‌తో అధికార పక్షానికి చెందిన నేతలు లోలోపల మదన పడుతున్నారు. ఒక్క బాన్సువాడ ట్రెజరిలోనే 5027 బిల్లులకు గాను రూ.94.46 కోట్లు రావాల్సి ఉంది. జిల్లాలో బాన్సువాడ, కామారెడ్డి, ఎల్లారెడ్డి, మద్నూర్ ట్రెజరీల్లో సుమారుగా రూ.250 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది.

కేంద్రం నుంచి నేరుగా జీపీలకు..

ఇటీవల తాము జీపీలకు ఇచ్చిన నిధులు సైతం రాష్ట్ర ప్రభుత్వం వినియోగించకుంటోందని కేంద్ర సర్కారు ఆరోపిస్తుంది. దీనికి ప్రత్యామ్నాయంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జీపీల పేరుతో ప్రత్యేకంగా ఖాతాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే 70 శాతం పైగా పంచాయితీలు సర్పంచు, ఉపసర్పంచు పేరుతో అకౌంట్లు తెరిచాయి. దీంతో కేంద్రం నిధులు ఇకపై నేరుగా ఖాతాల్లో జమకానున్నాయి. ఈ ప్రక్రియ ద్వారా కేంద్రం నిధులను నేరుగా ఖర్చు చేసుకునేందుకు జీపీలకు వెసులుబాటు కలగనుంది.

ఏరియల్ బిల్లులు రావడం లేదు

గత ఏడాది నవంబర్‌లో ఏరియల్ బిల్లులు పంపిస్తే ఇప్పటి వరకు రాలేవు. 15 నెలలుగా ఏరియల్ బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయి. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలి. ప్రభుత్వం ఏరియల్ బిల్లులు విడుదల చేయాలి.

– భూపతి, టౌన్‌ప్లానింగ్ అధికారి

ప్రభుత్వం నుంచే పెండింగ్ ఉన్నాయి

ట్రెజరిలో బిల్లులు పెండింగ్‌లో ఏమి లేవు. మేము బిల్లులు చేసి పంపినాం. ప్రభుత్వం నుంచే పెండింగ్ అని చూపుతుంది. బాన్సువాడ ట్రెజరి పరిధిలో రూ.94.46 కోట్ల బిల్లులు రావాలి. కొన్ని బిల్లులు రెండు, మూడు రోజుల్లో విడుదల అయ్యే అవకాశం ఉంది. – జగన్, ఏసీటీవో బాన్సువాడ

పరిశోధన రంగంలో అగ్రగామిగా దేశం



మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్

నిజామాబాద్‌అర్బన్: పరిశోధన రంగంలో భారత దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని తెలంగాణ విశ్వవిద్యాలయం వీసీ రవీందర్ అన్నారు. సోమవారం గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం విభాగంలో ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న వీసీ మాట్లాడుతూ పరిశోధనాలపై విద్యార్థులు శ్రద్ధ చూపాలన్నారు. ఇప్పటికే తెలంగాణ యూనివర్సిటీ పరిశోధనాలు ఎంతో పేరు సంపాదించాయన్నారు.అనంతరం ఐసీఎస్ఎస్‌ఆర్ డైరెక్టర్ బి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలను ప్రోత్సహించే దిశగా ఐసీఎస్ఎస్‌ఆర్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. అనంతరం అర్థశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ 75 ఏళ్లలో భారతదేశం ఆహార కొరత నుంచి సుస్థిరాభివృద్ధి సాధించిందన్నారు. సదస్సులో రవీందర్ రెడ్డి, పున్నయ్య ప్రసంగించారు. వివిధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధకులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆదెప్ప, వేణుప్రసాద్, భరద్వాజ్ సురేష్, లక్ష్మీనారాయణ, యూజీసీ కో ఆర్డినేటర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరికి 8 నెలల జైలు

కామారెడ్డి క్రైం: తరచూ బైక్ దొంగతనాలకు పాల్పడిన ఓ వ్యక్తికి ఎనిమిది నెలల 22 రోజుల జైలు శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన మహమ్మద్ అన్వర్ కామారెడ్డిలోని ఆయా కాలనీల్లో ఐదు బైకులను చోరీ చేశాడు. పట్టణ పోలీసులు అతడిని గత ఏడాది జూలైలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పరిశీలించిన కామారెడ్డి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ సోమవారం తీర్పు వెల్లడించారు.

ఎస్పీ అభినందన

నిందితునికి 8 నెలల 22 రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శివరాంనాయక్, కామారెడ్డి ఎస్‌హెచ్ఓ నరేష్, కోర్టు కానిస్టేబుల్ కరుణాకర్‌లను ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

ఇందల్వాయిలో చోరీ

ఇందల్వాయి: ఇందల్వాయిలో శనివారం మధ్యాహ్నం నల్లవెల్లి గ్రామానికి చెందిన కిరాణ వ్యాపారి వేముల సంజీవ్ ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. సంజీవ్ అద్దెకు ఉంటున్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ప్రవేశించి రూ.1.30 లక్షల నగదు, 30 గ్రాముల బంగారు నగలు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి మృతి



కామారెడ్డి క్రైం: ఫిట్స్ రావడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే ప్లాట్‌ఫాంపై ఆదివారం అర్ధరాత్రి జరిగింది. ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) రెండో ప్లాట్‌ఫాంపై పడిపోయి ఉన్నట్లు తెలియడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ జరిపారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఫిట్స్ రావడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. ఎవరైనా అతడిని గుర్తు పడితే కామారెడ్డి రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైల్వే ఎస్సై తావూనాయక్ కోరారు.

కెనాల్‌లో పడి ఒకరు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సారంగాపూర్ శివారులో డెయిరీ ఫారం దగ్గర నిజాంసాగర్ కెనాల్‌లో పడి గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. జీవితంపై విరక్తి చెంది ఇద్దరు, మద్యానికి బానిసై ఒకరు, మరో కారణంతో వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డారు.



సిద్ధరాములు (ఫైల్)

రాజంపేట: ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సిద్దాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. సిద్దాపూర్ గ్రామానికి చెందిన పట్నం సిద్ధరాములు(60) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సోమవారం ఉదయం ఆయన గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్నట్లు గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కూతురు వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఖాజాపూర్‌లో ఒకరు..



మారయ్య (ఫైల్)

బోధన్‌రూరల్: సాలూర మండలం ఖాజాపూర్ గ్రామానికి చెందిన చింతం మారయ్య (42) ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై సందీప్ తెలిపారు. వివరాలు.. మారయ్య కొంతకాలం నుంచి మద్యానికి బానిసై పని చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తి చెంది..



హన్మండ్లు మృతదేహం

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని వాజిద్‌నగర్ శివారులో సోమవారం గ్రామానికి చెందిన తోట హన్మండ్లు(58) సెల్ టవర్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హన్మండ్లు కొంతకాలంగా మానసి స్థితి సరిగ్గా లేక అనారోగ్యంతో బాధపడుతున్నాడు జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మృతుడి భార్య విఠవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

నస్రుల్లాబాద్‌లో ఒకరు..



సాయిలు(ఫైల్)

నస్రుల్లాబాద్: మండల కేంద్రానికి చెందిన ఉల్లెంగ సాయిలు (48) జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సాయిలుకు గతంలో రెండు పెళ్లిలు జరగ్గా విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి భార్య పిల్లలు లేరని బాధపడేవాడు. ఇటీవల ఆయన చేయి విరిగింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన సాయిలు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తమ్ముడు కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు పేర్కొన్నారు.

రెండో వివాహం కోసమే..

- బాలుడిని హతమార్చిన తల్లి
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

మాక్లూర్: కొడుకును హత్య చేసి పారిపోయిన నిందితురాలు గడ్డం లావణ్యను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని సాయి నగర్ (ఇందిరాపురం) కాలనీకి చెందిన లావణ్య మార్చి 28 తెల్లవారుజామున మండలంలోని దాస్‌నగర్ శివారు నిజాంసాగర్ కాలువ వద్ద ఆరేళ్ల కుమారుడు రోహిత్‌ను గొంతు నులిమి హత్య చేసిన విషయం తెలిసిందే.. విచారణలో భాగంగా సోమవారం నగరంలోని పోస్టు ఆఫీస్ వద్ద నిందితురాలు లావణ్యను అదుపులోనికి తీసుకొన్నట్లు ఎస్సై తెలిపారు. రెండో వివాహం చేసుకోవటానికి సిద్ధపడి ఈ హత్య చేసినట్లు లావణ్య తమ విచారణలో వెల్లడించిందన్నారు. చేస్తున్న తప్పుడు పనులపై తరుచూ భర్త భరత్ ప్రశ్నించడంతో అతడికి విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకోవటానికి సిద్ధమైందన్నారు. కుమారుడు రోహిత్‌ను ముందుగా అడ్డు తొలగించుకొని ఆ తర్వాత పెళ్లి చేసుకోవాలనే ఉద్దేశంతో మార్చి 28న నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోహిత్‌తో కలిసి ఆటోలో దాస్‌నగర్‌లో వెళ్లింది. అక్కడి నుంచి కాల్వ గట్టుపై కొద్ది దూరం వరకు తీసుకెళ్లి గొంతు నులిమి హత్యచేసి కాలువలో పారేసినట్లు నిందితురాలు విచారణలో అంగీకరించిందని ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు.

ప్రమాదాల్లో ముగ్గురి మృత్యువాత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం పిప్రి గ్రామం చెరువులో చేపల వేటకు వెళ్లి నీల యాదగిరి(46) మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఆర్మూర్‌లోని పోచమ్మ గల్లీకి చెందిన యాదగిరి కూలీ పని చేస్తూనే చేపలను విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారి లాగానే ఆదివారం సాయంత్రం పిప్రి గ్రామంలోని చెరువులో చేపలను వేటాడుతూ ప్రమాదవశాత్తూ తెప్పపై నుంచి చెరువులో పడిపోయాడు. చెరువు లోతు ఎక్కువగా ఉండడం, యాదగిరి కాళ్లకు చేపల వల చిక్కుకు పోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడికి భార్య విజయ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సురేష్ బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..



ప్రమోద్(ఫైల్)

నాగిరెడ్డిపేట: మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కర్రోల్ల ప్రమోద్ కుమార్ (26) సోమవారం వేకువజామున మెదక్ పట్టణంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందాడు. ప్రమోద్‌కుమార్ మెదక్ జిల్లా గాంధారిపల్లి నుంచి ఆదివారం అర్ధరాత్రి బైక్‌పై తన స్వగ్రామానికి బయల్దేరాడు. కాగా ఆయన మెదక్ చేరుకోగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రమోద్‌కుమార్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన అక్కడి పెట్రోలింగ్ పోలీసులు యువకుడిని చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం హైద్రాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

జారి పడి హమాలీ..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాదిలో గల సంతోష్‌రెడ్డి రైస్‌మిల్లులో హమాలీగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన చౌదరీ సంతోష్(34) ధాన్యం సంచుల లాట్ పైనుంచి జారీపడి మృతి చెందాడు. వివరాలు.. సంతోష్‌తోపాటు మరికొంత మంది బీహారీ కూలీలు ఏడాది కాలంగా రైస్‌మిల్లులో పనిచేస్తున్నారు. వీరిలో సంతోష్ కొంతకాలంగా మద్యానికి బానిసై సరిగా పనిచేయకుండా తిరుగుతున్నాడు. తాగిన మత్తులో ధాన్యం బస్తాల లాట్‌పై ఎక్కినప్పుడు ప్రమాదవశాత్తు జారి పడటంతో ముక్కుకు తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారు. మృతుడి బంధువు రాజేష్‌రామ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏడు ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న అధికారులు

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో వ్యవసాయ క్షేత్రాల వద్ద గలఏడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్, కాపర్ తీగలను గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగ, ఆయిల్‌ను చోరీ చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే కాకతీయ కాలువ వెంబడి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లనే టార్గెట్ చేసి ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మెండోరా పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌కో అధికారులు ఫిర్యాదు చేశారు.

రైతుల ఆందోళన

ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ అయిన ప్రదేశంలో గతంలో మూడింటిని ఎత్తుకెళ్లారు. ప్రస్తుతం ఏడు ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో కాకతీయ కాలువకు అమర్చిన మోటార్లను కూడా ఎత్తుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురి కాకుండా ట్రాన్స్‌కో అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మత్తులో కత్తితో వీరంగం

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుబ్బ ప్రాంతంలో గంజాయి, మద్యం మత్తులో ఖలీమ్ అనే వ్యక్తి కత్తితో ఆదివారం రాత్రి వీరంగం చేశాడు. ఖలీమ్ భార్య మహారాష్ట్రకు వెళ్లిపోవడంతో తన భార్య కావాలని రోడ్డుపై కత్తితో తిరగడంతో తన స్నేహితుడైన భాస్కర్ ఆపేందుకు యత్నించారు. ఖలీల్ కత్తితో తిరగడంతో స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఖలీమ్, భాస్కర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన వ్యాన్



సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామ సమీపంలో ఓమ్నీ వ్యాన్ పొలాల్లోకి దూసుకెళ్లింది. ధర్పల్లికి చెందిన విష్ణు కొండూర్ గ్రామంలో బీడీ కార్ఖానా నడిపిస్తున్నాడు. కార్ఖానాలో కుటుంబ సభ్యులతో కలిసి సత్యనారాయణ వ్రతం చేశాడు. పూజ పూర్తయిన అనంతరం కుటుంబ సభ్యులను ధర్పల్లిలో వదిలేసి బీడీలు ఎంచుకోవడానికి తిరిగి కొండూర్ వస్తుండగా ఓమ్నీ వ్యాను పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో విష్ణుకు ఎలాంటి గాయాలు కాలేదు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



ధీరజ్(ఫైల్)

దోమకొండ: దోమకొండకు చెందిన కామినేని ధీరజ్(37) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిన ధీరజ్ సోమవారం ఉదయం గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద గల కల్లు కంపౌండ్‌లో శవమై కనిపించాడు. మద్యం తాగడంతో మృతిచెందాడా లేక ఇతర వ్యక్తులతో గొడవ వల్ల మృతిచెందాడా అనే కోణంలో దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు. కాగా మద్యం తాగించి హత్య చేసి ఉంటారని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి సోదరుడు సుధీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.